

కుంటలగూడలో కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న విజిత్‌రావు

# బాధిత కుటుంబాలకు పరామర్శ

దండేపల్లి, అక్టోబర్ 25 : దండేపల్లి మండల కేంద్రంతో పాటు తాళ్లపేట, రాజుగూడ జీపీ పరిధిలోని జైతుగూడ, కుంటలగూడ, నాగసముద్రం, ముత్యంపేట, కొర్విచెల్మ, లక్ష్మీకాంతాపూర్, పెద్దపేట గ్రామాల్లో ఇటీవల పలువురు అనారోగ్యంతో మృతి చెందారు. కాగా, బాధిత కుటుంబాలను నడిపెల్లి ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు విజిత్‌రావు బుధవారం పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పార్టీ తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా కన్వీనర్ గురువయ్య, వైస్ ఎంపీపీ అనిల్, పీఏసీఎస్ చైర్మన్ కాసనగొట్టు లింగన్న, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ బండారి మల్లేశ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఉప సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

# మడెల్లయ్య ఆలయానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న వెంకటేశ్

దండేపల్లి, అక్టోబర్ 25 : మాదాపూర్ గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో నిర్మించనున్న మడెల్లయ్య స్వామి ఆలయ నిర్మాణానికి ఆ సంఘం అధ్యక్షుడు మందపెల్లి వెంకటేశ్ భూమి పూజ చేశారు. ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు ఎనగందుల సతీశ్, బుచ్చన్న, అభి, రమేశ్, రాజు, లక్ష్మి, సత్తవ్వ, రవి తదితరులు పాల్గొన్నారు.

# వైన్ షాప్‌లో దొంగతనం

చెన్నూర్ టౌన్, అక్టోబర్ 25 : చెన్నూర్ పట్టణంలోని కొత్తబస్టాండ్ సమీపంలో గల మాధవీ వైన్ షాప్‌లో బుధవారం చోరీ జరిగింది. పట్టణంలో తరచూ దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వైన్ షాప్‌నకు గల షెట్టర్‌ను బలమైన ఇనుపరాడ్‌తో పైకి ఎత్తి దుకాణంలోకి చొరబడినట్లు సీసీ కెమెరా ఫుటేజీలో రికార్డయ్యింది. ఈ మేరకు వైన్ షాప్ యజమాని పోలీసులకు సమాచారం అందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. కాగా, షాపులోనుంచి రూ.15 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు సీసీ కెమెరాలో కనిపించిందని స్థానికులు చెబుతున్నారు.

# వారెవ్వా రేండ్లగూడ

- వాడవాడలా సీసీ రోడ్లు, డ్రైనేజీలు
- వైకుంఠధామంలో సోలార్ కాంతులు
- రూ.1,09,27,000 నిధులతో అభివృద్ధి పనులు




మదర్ థెరిస్సా కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు

జన్నారం, అక్టోబర్ 25 : అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న జన్నారం మండలం రేండ్లగూడ.. ప్రస్తుతం ప్రగతి పథంలో దూసుకుపోతున్నది. తెలంగాణ సర్కారు కృషితో అభివృద్ధికి కేరాఫ్‌గా మారింది. ప్రత్యేక నిధులతో అన్ని రకాల పనులు పూర్తిచేసుకున్నది.

రేండ్లగూడ గ్రామంలో 2,551 మంది జనాభా ఉన్నది. 1,843 మంది ఓటర్లున్నారు.




నిర్మించిన వైకుంఠధామం

ఇక్కడ గతంలో వర్షాలు పడితే రోడ్లన్నీ గుంతలుపడి బురదమయంగా మారేవి. దీంతో ప్రజలు నిత్యం నరకం చూసేవారు. ప్రస్తుతం పల్లె ప్రగతిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ప్రత్యేక నిధులు కేటాయించడంతో గ్రామంలో రూ.1,09,27,000తో అన్ని రకాల పనులు చేపట్టారు. అలాగే మండలంలో ఎక్కడా లేని విధంగా సోలార్ విద్యుత్ కాంతులు ఏర్పాటు చేశారు. వైకుంఠధామానికి ఎప్పుడు వెళ్లినా ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు రూ.3 లక్షల 31వేలతో సోలార్ విద్యుత్ మోటర్ అమర్చారు. రూ.12 లక్షల 14 వేలతో రోడ్ల వెంట, గ్రామంలో ప్రధాన చౌరస్తాలో సోలార్ లైట్లను ఏర్పాటు చేశారు. గ్రామంలోని 10 వార్డులో రూ.47 లక్షల 72 వేలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ప్రతివార్డులో ప్రముఖుల పేర్లతో స్వాగత బోర్డులను ఏర్పాటు చేశారు. గ్రామంలో క్రీడా ప్రాంగణం, పల్లె పకృతివనం, శ్మశానవాటిక, డంప్ యార్డ్ నిర్మాణంతోపాటు చెత్తను తీసుకెళ్లేందుకు ట్రాక్టర్, ట్రాలీని కొనుగోలు చేశారు. నిత్యం మిషన్ భగీరథ నీటిని నల్లాల ద్వారా సరఫరా చేస్తున్నారు. అలాగే పంచాయతీ సిబ్బంది ట్రాక్టర్‌తో ఇంటి వద్దకే వెళ్లి, తడిపోడి చెత్తను తీసుకెళ్తున్నారు.

### అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాం..



పల్లె ప్రగతి కార్యక్రమాన్ని సీఎం కేసీఆర్ పకడ్బందీగా అమలు చేస్తున్నారు. ప్రభుత్వం, వార్డు సభ్యుల సహకారంతో సర్కారు మంజూరు చేసిన నిధులతో అన్ని రంగాల్లో అభివృద్ధి పనులు చేపట్టాం. ప్రణాళికతో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశాం. ప్రస్తుతం గ్రామంలో పారిశుధ్య పనులను నిత్యం నిర్వహించి, అన్ని పంచాయతీలకు ఆదర్శంగా నిలువాలని పట్టుదలతో పనిచేశాం.

**- నెమలికొండ అశారాజ్, రేండ్లగూడ, సర్పంచ్**

### పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టిపెట్టాం..



గ్రామంలో పారిశుధ్య పనుల నిర్వహణపై ప్రత్యేక దృష్టిపెట్టాం. ప్రతి రోజూ పంచాయతీ సిబ్బంది అన్ని వార్డుల్లోకి వెళ్లి ప్రజలు ఇచ్చిన తడి, పొడి చెత్తను వేరు చేస్తూ డంప్ యార్డుకు తరలిస్తున్నాం. హరితహారంలో నాటిన మొక్కలకు నీరు అందిస్తూ వాటిని సంరక్షిస్తున్నాం అన్ని వార్డుల్లో ప్రతిరోజూ సిబ్బందితో చెత్తలేకుండా వాడలు శుభ్రంగా ఉండేలా చూస్తున్నాం.

**- లాకవత్ శ్రీనివాస్, కార్యదర్శి, రేండ్లగూడ**

# విధులు బహిష్కరణ

లక్సెట్టిపేట, అక్టోబర్ 25 : లక్సెట్టిపేట న్యాయస్థానంలో న్యాయవాదులు బుధవారం తమ విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కారుకూరి సురేందర్ మాట్లాడుతూ.. రోజు రోజుకూ న్యాయవాదులకు రక్షణ లేకుండా పోతున్నదన్నారు. ఈ నెల 24న మంచిర్యాలలో అర్ధరాత్రి న్యాయవాది గూడూరి సత్యనారాయణ కారుకు కొందరు దుండగులు పెట్రోల్ పోసి నిప్పుపెట్టారని పేర్కొన్నారు. వారిని వెంటనే అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రాజేశ్వర్‌రావు, అక్కల శ్రీధర్, ప్రదీప్, తిరుపతి స్వామి, న్యాయవాదులు ప్రకాశం, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



లక్సెట్టిపేటలో విధులు బహిష్కరించిన న్యాయవాదులు

# సద్వినియోగం చేసుకోవాలి

లక్సెట్టిపేట, అక్టోబర్ 25 : ఇంటిగ్రేడ్ బీఏబీఎడ్ కోర్సును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని లక్సెట్టిపేట ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జైకిషన్ ఓజా సూచించారు. 2023-24విద్యా సంవత్సరానికి గాను నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ ద్వారా నూతనంగా అనుమతి పొందిన సమీకృత ఉపాధ్యాయ విద్యా కార్యక్రమం 4 ఏండ్ల సమీకృత కోర్సులో అడ్మిషన్లు పొందాలని పేర్కొన్నారు. అందుకు విద్యార్థులు ఇంటర్‌లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత కలిగి ఉండడంతో పాటు, నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ నిర్వహించిన అర్హత పరీక్షలో కనీస మార్కులు సాధించి ఉండాలని తెలిపారు. విద్యార్థులు 30వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం కళాశాల వెబ్‌సైట్ https://gdcts.cgg.gov.in/luxettipet.eduలో గానీ, 94400 36165, 99367 74482, 99631 04959, 89782 50444 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

# ఎన్నికల్లో హెచ్‌ఆర్‌డీఏకు స్పందన

మంచిర్యాల ఏసీసీ, అక్టోబర్ 25 : రాష్ట్రంలో 17 ఏండ్ల తర్వాత జరుగుతున్న టీఎస్‌ఎంసీ ఎన్నికల్లో హెచ్‌ఆర్‌డీ ప్యానల్‌కు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విభాగాల వైద్యుల నుంచి భారీ స్పందన వస్తున్నదని మంచిర్యాల ప్రముఖ ఆర్థో వైద్యుడు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హెచ్‌ఆర్‌డీఏ ప్యానల్ అధ్యక్షుడు యెగ్గెన శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏయిమ్స్ దవాఖానలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హెచ్‌ఆర్‌డీఏ పోరాటంతో 17 ఏండ్ల తర్వాత ఎన్నికలు వచ్చాయని పేర్కొన్నారు. వైద్యులు, వైద్య వృత్తికి సంబంధించి ఎన్నో సమస్యలపై కోర్టుకు వెళ్లి, 40కి పైగా కేసులు వేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ ఎన్నికల్లో వైద్యులంతా బాధ్యతాయుతంగా పాల్గొని, తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సునిత, సంతోష్, ప్రవీణ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# అ'పూర్వ' సమ్మేళనం

గర్మిళ్ల, అక్టోబర్ 25 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల 2002-03 పదోతరగతి విద్యార్థులు బుధవారం అ'పూర్వ' సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. అనంతరం విద్యా బుద్ధులు నేర్పిన గురువులు వెంకటరమణ, వెంకటకృష్ణ, ఛాయారాణి, రాజశేఖర్, సూరిని గుర్తు చేసుకుంటూ ఆట, పాటలతో సంతోషంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సుధీర్, వెంకటేశ్, నాగార్జున, రాజేందర్, రవీందర్, వెంకటస్వామి, అవంతి, సౌమ్య, సువర్ణ, సౌజన్య, స్రవంతి పాల్గొన్నారు.



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు